క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గుడిపేట పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల ఎస్ఆర్ఆర్ కళాశాల, గుడిపేట మౌంట్ కార్మల్ పాఠశాలల్లో విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతికతను ఉపయోగించడం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా, ఆర్ఐలు కుమారస్వామి, శ్రీనివాస్, గోపి, రవి, మారుతి, ఆర్ఎస్సైలు రాజశేఖర్, శేఖర్ పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో మహిళా పోలీసులు



తనిఖీల్లో సీఆర్పీఎఫ్ మహిళా పోలీసులు

దండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తాళ్లపేట, గూడెం వద్ద పోలీసులు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం నుంచి సీఆర్పీఎఫ్ మహిళా పోలీసులు బలగాలను అందుబాటులో ఉంచారు. తనిఖీల్లో మహిళా పోలీసులు ఆయుధాలతో కనిపించడం ప్రత్యేకతను సంతరించుకుంది.

కుమురం భీం వర్ధంతి



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో కుమురంభీం వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొడిపె వెంకటేశ్ ఆధ్వర్యంలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు చింతపుడి రాములు, మహిళా సంఘం అధ్యక్షురాలు పోతురాజుల బాయక్క, నాయకులు శంకర్, లక్ష్మీనారాయణ, వెంకటి, భీమయ్య, సమ్మయ్య, భీమేష్, పోశం, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాల పనితీరుపై అవగాహన

భీమిని: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు ఆయుధాలపై ఎస్సై నరేష్ అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది విధుల నిర్వహణ, పోలీసు విధులు, ఆయుధాల పనితీరు గురించి తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మణ్, మహేష్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన దళిత యువకుడు ప్రశాంత్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, జాతీయ ఎస్సీ రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు కొండా నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రశాంత్‌ను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో సాగర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద రైతు వేదికలో వరి, పత్తి పంటల్లో నాణ్యత ప్రమాణాల గురించి రైతులకు ఏఈవో సాగర్ శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు.

పోచమ్మా.. జర చూడమ్మా

- ఇష్టారాజ్యంగా వినాయక విగ్రహాలు, బతుకమ్మల నిమజ్జనం
- వ్యర్థాలతో పోచమ్మ చెరువులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పోచమ్మ చెరువు దుర్వాసనకు నిలయంగా మారింది. వ్యర్థ పదార్థాలతో నిండి కంపుకొడుతోంది. చెరువు పక్క నుంచి రోడ్డు మీదుగా రాకపోకలు చేస్తున్న గ్రామీణులు ముక్కుమూసుకుంటున్నారు. అంత్యక్రియలు నిర్వహించి స్నానం ఆచరించడానికి కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్తే భరించలేని దుర్గంధం వస్తోంది. దీంతో చేతిపంపు నీళ్లతో సరిపెట్టుకుంటున్నారు. చెరువు నీళ్లు వినియోగించలేని పరిస్థితులు ఏర్పడ్డ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

విగ్రహాలు, బతుకమ్మల నిమజ్జనంతో..

ప్రస్తుతం పోచమ్మ చెరువుల్లో ఇష్టారాజ్యంగా వినాయక విగ్రహాలు, బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు. ఏటా చెరువుల్లో వీటిని వదిలేస్తుండటంతో వ్యర్థపదార్థాలు పెరిగిపోతున్నాయి. విగ్రహాల రసాయనాలు చెరువు నీటిలో కలిసిపోయి జల కాలుష్యం ప్రబలుతోంది. ఈ కారణంగా జీవాలు ఆ నీటిని తాగడానికి ఇష్టపడని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాస్తవానికి చెరువుల్లో విగ్రహాలు, బతుకమ్మలు నిమజ్జనం తర్వాత వాటిని బయటకు వెలికితీసి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవల్సి ఉండగా మున్సిపల్, సింగరేణి అధికారుల్లో చలనం లేకుండా పోతోందనే విమర్శలు వస్తున్నాయి.

విద్యుత్ ఉత్పత్తి కోసం చెరువుల తవ్వకం

బెల్లంపల్లి కేంద్రంగా 1926లో బొగ్గుగనుల ప్రస్థానం ప్రారంభమైంది. సింగరేణి కార్మికులు, అధికారుల నివాసాల కోసం క్వార్టర్లు నిర్మించింది. అదేక్రమంలో కంపెనీ అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఆటోగ్యారేజ్, వర్క్‌షాప్, స్టోర్, ఎక్స్‌ప్లోరేషన్, సివిల్ తదితర విభాగాలు ఏర్పాటు చేశారు. వీటన్నింటికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఏదేని పరిస్థితుల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగితే అత్యవసరంగా విద్యుత్ వాడకం కోసం 8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్‌హౌజ్ నిర్మించారు. దాదాపు 80 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగింది.



పెద్ద చెరువులో నిమజ్జనం చేసిన బతుకమ్మలు



రోడ్డుకు అవతలివైపు చెరువు నీటిలో తేలియాడుతున్న గణపతి విగ్రహాలు

విద్యుత్ ఉత్పత్తికి నీటి అవసరాల కోసం గొలుసుకట్టు చెరువులు తవ్వారు. పోచమ్మ గుడి పక్కన రోడ్డుకు ఇవతలి వైపున పెద్ద చెరువును తవ్వగా, ఆ పక్కన రోడ్డును ఆనుకుని మరో రెండు చెరువులు ఏర్పాటు చేశారు. పోచమ్మ గుడి పక్కన చెరువుల నిర్మాణం జరగడంతో వాటికి పోచమ్మ చెరువులనే పేరు స్థిరపడి పోయింది. దశాబ్దంన్నర క్రితం సింగరేణి యాజమాన్యం పవర్ హౌజ్‌ను ముంబైకి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీకి స్క్రాప్ కింద అమ్మేయడంతో పోచమ్మ చెరువులతో సింగరేణికి అవసరం లేకుండా పోగా, అప్పటి నుంచి చెరువుల పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పుకుంది.

వ్యర్థాలు తొలగించాలి



పోచమ్మ చెరువుల్లో కొన్నేళ్ల నుంచి వినాయక విగ్రహాలు, బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు. కాని ఆ వ్యర్థాలను ఇంతవరకు వెలికితీయలేదు. చెరువులోనే ఉండి పోవడంతో ఏటా వ్యర్థాలు పెరిగి కంపు వాసన వస్తోంది. చెరువు నీటిని తొలగించే చర్యలు చేపట్టాలి.- ఎదురుగట్ల రవీందర్‌గౌడ్, బెల్లంపల్లి

చర్యలు తీసుకోవాలి



చెరువు దుస్థితిపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు నీటి కాలుష్యాన్ని నివారించాలి.

– ఎం.వినోద్‌కుమార్, బెల్లంపల్లి

ఏమాజీకే బీజేపీ టికెట్ కేటాయించాలి

బెల్లంపల్లి: బీజేపీ అధిష్టానం బెల్లంపల్లి ఎమ్మెల్యే టికెట్‌ను కొయ్యల ఏమాజీకే కేటాయించాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఏమాజీని కాదని ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవికి టికెట్ ఖరారు చేయడం సరైంది కాదన్నారు. శ్రీదేవి అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. అధిష్టానం పున:రాలోచన చేసి ఏమాజీకి టికెట్ కేటాయించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న తనను విస్మరించడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సెల్ సభ్యుడు కేశవరెడ్డి, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, ప్రకాశ్, సోమన్న, ప్రభాకర్, శ్రావణ్‌కుమార్,నర్సింగ్, దశరథం, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ఐదో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న విజిత్‌రావు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.విజిత్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ పార్టీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. దివాకర్‌రావును మరోసారి గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్ కుమార్, ఉపాధ్యక్షుడు సంతోషచారి, స్థానిక వార్డు కౌన్సిలర్ బౌతులక్ష్మి, టీబీజీకేఎస్ నాయకులు కె.సురేందర్‌రెడ్డి, డి.అన్నయ్య, వై.కాశీరావు, నాయకులు మల్లెత్తుల రాజేంద్రపాణి, వెంగళ కుమారస్వామి, జక్కుల రాజేశం, మధు, ప్రశాంత్ పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ మేనిఫెస్టోతో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు దాసరి మధునయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందాలని శుక్రవారం స్థానిక బడాహనుమాన్ మందిర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా పూజలు చేశారు. అనంతరం 10వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు, బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్, అకినపల్లి సత్యనారాయణ, సురేశ్, ఆకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలే నా బలమని, అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి విజయం సాధించి చరిత్ర సృష్టిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రైతుబంధు పథకం ఆపాలన్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఏవి ఉండవని అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందూరి రమేశ్, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, బత్తిని వెంకటేశ్‌గౌడ్, కామెర శ్రీనివాస్, చీర్ల మొండన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నేడు విద్యుత్ అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలోని ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ రేగుంట స్వామి ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నల్లజెండాలతో బీఆర్ఎస్ నిరసన



పంట పొలాల్లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నెన్నెల: రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పంట పొలాల్లో పార్టీ నాయకులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నల్లజెండాలతో నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు సాగర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. రైతులకు భరోసా ఇచ్చే రైతుబంధుపై కుట్ర పన్నుతుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ తిరుపతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, బత్తిని వెంకటేశ్, కామేర శ్రీనివాస్ పాల్గొన్నారు.



దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దండేపల్లి: దండేపల్లిలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఉపసర్పంచ్ భూమన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, నాయకులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

తాండూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ ఈసీకి లేఖ రాయడాన్ని నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు గౌస్, సార్ల తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని నస్పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అంతకుముందు శక్తి కేంద్రం ఇన్‌చార్జి బద్రి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి పైగా యువకులు బీజేపీలో చేరారు. రఘునాథ్ వారికి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పట్టణ కన్వీనర్ సత్రం రమేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, ఉపాధ్యక్షుడు సామ్రాట్ రమేశ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్, నాయకులు రానవేన శ్రీనివాస్, కుర్రె చక్రవర్తి, రవి, మహేందర్, తిరుపతి, భీమయ్య పాల్గొన్నారు.



కాషాయ కండువా కప్పుతున్న రఘునాథ్

బీఆర్ఎస్‌లో చేరికలు

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి ఆధ్వర్యంలో సీపీఐకి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పారు. మాజీ జెడ్పీటీసీ సురేష్‌బాబు, నాయకులు మాసాడి తిరుపతి, వెంకటేశం తదితరులు ఉన్నారు.

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సుమారు 80 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, నాయకులు శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్: కండువా కప్పుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

అభివృద్ధిని విస్మరించడం సరికాదు

జన్నారం: బీఆర్ఎస్ ప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించడం సరికాదని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 ఏళ్లలో సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలను అభివృద్ధి చేశారే తప్ప ఖానాపూర్ అభివృద్ధిపై ఎందుకు ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు అటువైపే ఏర్పాటు చేసుకున్నా మంత్రులు ఖానాపూర్ నియోజకవర్గం జన్నారంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి పట్టించుకోలేదన్నారు.

‘హామీలు నెరవేర్చని ప్రభుత్వ విప్’

మందమర్రిరూరల్: నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని, అలాంటి బీఆర్ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ ఆరోపించారు. మందమర్రిలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, అర్హులకు దళితబంధు పథకాలు అందలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో స్థానికేతరుడైన బాల్క సుమన్‌ను ఓడించి స్థానికుడిని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు రంజిత్, అఖిల్, రాజేందర్, రవీందర్, పవన్‌కుమార్, రవి, మారుతి, మనోహర్, వినయ్, రవితేజ, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింగ్

ఘనంగా గ్యార్వి జెండా పండుగ



తాండూర్: మండలంలో గురువారం రాత్రి గ్యార్వి జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. జామామసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో ముస్లింలు జెండాలతో తాండూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌస్ పాక్ దర్గా వద్ద, తంగళ్లపల్లి మసీదు వద్ద శుక్రవారం అన్నదానం చేపట్టారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

జైపూర్: కడుపునొప్పి భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని టేకుమట్లలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కాగజ్‌నగర్‌కు చెందిన స్వాతి(19) టేకుమట్లలోని వారి పెద్దమ్మ–పెద్దనాన్న అయిన తిరుమల–రాజమల్లు ఇంట్లో ఉండి చదువుకుంటుంది. గత కొంతకాలం కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి బాధ భరించలేక ఇంట్లోనే స్వాతి ఉరేసుకుంది. గమనించిన బంధువులు వెంటనే మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. స్వాతి తల్లిదండ్రులు కాగజ్‌నగర్ తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా, ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గడప గడపకూ కాంగ్రెస్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మహిళా అధ్యక్షురాలు రజిత, నాయకులు చింత అశోక్, ఎండీ ఆరీఫ్, సువర్ణ, నర్సింహాచారి పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

జన్నారం: మండలంలోని పొనకల్‌లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదిష్టానం వెడ్మ బొజ్జుకు టికెట్ ఖరారు చేయడంతో ప్రచారం ముమ్మరం చేశారు. ఫసీఉల్లా, గంగన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం మెరుపు దాడులు చేశారు. తాండూర్ మండలం రేచిని గ్రామంలో ముక్క నారాయణ వద్ద నాటుసారా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ తెలిపారు. పులిమడుగు, లింగాపూర్ గ్రామాల్లో దాడులు చేసి 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. కాసిపేట మండలం దేవాపూర్ గ్రామంలో పెద్ది హరీష్ వద్ద నుంచి అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్దిమాడలో ఎల్లక్క వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.